క్లుప్తంగా

కౌలురైతుకు ఎమ్మెల్యే సింహాద్రి పరామర్శ



అవనిగడ్డ: తుపానుకు పంట దెబ్బతినడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన కోడూరు మండలం వి. కొత్తపాలెంకు చెందిన బాదర్ల సూర్య ప్రభాకరరావును ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న రైతు బాదర్లను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. సాగు వివరాలు, అప్పుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడొద్దని నష్టపోయిన పంటకు ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చూస్తామని రైతుకు హామీ ఇచ్చారు. వైద్యశాల సూపరింటెండెంట్ జయకుమార్‌తో మాట్లాడి రైతుకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోడూరు: కోడూరులో ఇటీవల మృతిచెందిన ముగ్గురు వ్యక్తుల కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శుక్రవారం పరామర్శించారు. కోడూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ పోతన నాగరాజు తండ్రి హనుమయ్య ఇటీవల మృతి చెందాడు. హనుమయ్య మృతికి గల కారణాలను నాగరాజును అడిగి తెలుసుకొని హనుమయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే గ్రామానికి చెందిన ముక్కపూడి వాసుదేవరావు, చినగుడుమోటు గ్రామానికి చెందిన అబ్దుల్ మజీద్ మృతిచెందడంతో కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

నాగాయలంక: బందరు ఎంపీ వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు శనివారం నాగాయలంక మండలంలో పర్యటిస్తారని చల్లపల్లి ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ పులిగడ్డ వెంకటేశ్వరరావు తెలిపారు. గణపేశ్వరం శివారు బర్రంకుల సమీపంలోని మంగలేరు డ్రెయిన్‌పై శిథిలమైన వంతెన స్థానంలో రూ.80 లక్షల ఎంపీ నిధులతో చేపట్టనున్న నూతన వంతెన పనులకు ఉదయం 11 గంటలకు వారు శంకుస్థాపన చేస్తారని చెప్పారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

బంటుమిల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథి ఎంఈఓ–1 త్రిపుర సుందరీదేవీ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ఆచరణీయమన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టరు ఎస్.జగన్‌మోహన్‌రావు కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్ తిమోతి పాల్గొని క్రిస్మస్ విశిష్టతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ బీడీ జయరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ కాంగ్రెస్‌లో సత్తా చాటిన విద్యార్థులు

గూడూరు: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో గూడూరు మండలం ముక్కొలు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సత్తా చాటారు. జిల్లా వ్యాప్తంగా 135 పాఠశాలల విద్యార్థులు ప్రాతినిధ్యం వహించగా ముక్కొలు విద్యార్థులు సమ్మెట పావని కుమారి, సీహెచ్ లక్ష్మీదుర్గ రూపొందించిన ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. జిల్లా వ్యాప్తంగా 34 ప్రదర్శనలను ఎంపిక చేశారని పాఠశాల హెచ్ఎం తెలిపారు. విద్యార్థినులను హెచ్ఎం శ్రీహరి అభినందించారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

పంట పొలాల పరిశీలన

మోపిదేవి: తుపానుకు దెబ్బతిన్న పంట పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్టం నమోదు చేస్తున్నామని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి తెలిపారు. మెరకనపల్లి, ఉత్తరచిరువోలులంక గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామ సభలు నిర్వహించారు. మెరకనపల్లిలో సర్పంచ్ యర్రంశెట్టి ధనరాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు చేశారు. గ్రామ కార్యదర్శి రామ కోటేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాసోత్సవాలు

మచిలీపట్నంటౌన్: రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయకస్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమై జనవరి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. స్వామివారి ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించటంతో పాటు స్వాగత ద్వారం వద్ద స్వామివారి ప్రతిరూపాన్ని విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం 5.30 గంటలకు తిరుప్పావై సేవా కాలం జరుగుతుందన్నారు. ఈ నెల 23వ తేదీన ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఆలయ వైకుంఠ ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. ఆ రోజు స్వామివారి గ్రామోత్సవం నిర్వ హిస్తామని తెలిపారు. జనవరి 14వ తేదీ రాత్రి గోదాదేవి, రంగనాయకస్వామి వారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు.

ముసురు కలవరం



ఘంటసాల మండలం గోగినేనిపాలెంలో వరి కుప్పలు వేస్తున్న కూలీలు



కోడూరు మండలం మాచవరంలో పనలు తిప్పుతున్న కూలీలు

- మబ్బులు కమ్ముకున్న ఆకాశం
- పొలాల వైపు రైతుల పరుగులు
- ఆందోళనలో అన్నదాతలు
- కొండెక్కిన కూలీ రేట్లు

అవనిగడ్డ: వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న తరుణంలో పట్టిన ముసురు రైతులను కలవర పెడుతోంది. శుక్రవారం రోజంతా ముసురు, మబ్బులు పట్టడంతో దివిసీమ రైతులు పొలాల వెంట పరుగులు తీశారు. పనలపై ఉన్న పంటను కట్టేతలు కట్టించారు. తయారైన పంటను కోతలు కోయించారు. కోసిన పంట పనలను తిరగేయించారు.

ఆందోళనలో రైతులు

రోజంతా ముసురు పట్టడంతో దివిసీమ రైతులు తీవ్ర ఆందోళన చెందారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఈ ఖరీఫ్‌లో 1.03 లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి మండలాల్లో 45 శాతం వరికోతలు పూర్తయ్యాయి. అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల్లో ముమ్మరంగా వరికోతలు కోస్తున్నారు. ఈ తరుణంలో శుక్రవారం రోజంతా పట్టిన ముసురు రైతులను ఉరుకులు, పరుగులు పెట్టించింది.

పెరిగిన కూలీ రేట్లు

రెండు, మూడు రోజుల కిందటి వరకూ వరికోత ఎకరాకు రూ.4 వేలు ఉంది. పడిన వరిపొలం అయితే రూ.5 వేలు ఉంది. మిచాంగ్ తుపానుకు పంటపొలాల్లో నీరు చేరగా ఇప్పుడిప్పుడే తగ్గుతున్నాయి. రైతులందరూ ఒక్కసారిగా కోతలకు సిద్ధమవడంతో కూలీరేట్లు పెంచేశారు. పడకుండా ఉన్న పొలం ఎకరాకు రూ.5 వేలకు పెంచగా, పడిపోయిన పొలం ఎకరాకు రూ.7 నుంచి రూ.8 వేలకు పెంచేశారు. శుక్రవారం ఒక్కసారిగా వాతావరణం మారడంతో కట్టేతకు రేట్లు బాగా పెంచారు. గతంలో ఎకరాకు రూ.4 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.6 వేల నుంచి రూ.7 వేలకు పెంచేశారు. ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో చేసేదిలేక ఎంతైనా ఇచ్చి కట్టేతలు కట్టించుకున్నారు.

అమరజీవి త్యాగం అజరామరం

- ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి
- నేతల ఘన నివాళి

నాగాయలంక: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగం అజరామరమని పలువురు వక్తలు అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమం పలు ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించారు. నాగాయలంక మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక వాసవీ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంగణంలో నిర్వహించిన అమరజీవి వర్ధంతి కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు, గాంధీజీ విగ్రహాలకు మండల ఆర్య వైశ్య సంఘం పెద్దలు మునగాల మోహనరావు, చిట్టా శివనాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పేద వైశ్య యువకుడు సతీష్‌కు నూతన దుస్తులు బహూకరించారు. కన్యకా పరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు, సంఘం నాయకులు తాడికొండ సత్యనారాయణ, దేసు సత్యనారాయణ, చిట్టా వీర అన్నపూర్ణయ్య, కొల్లూరు రామకృష్ణ, శివశంకర్, ఆకుతోట సీతారామయ్య, గొడవర్తి యన్నా, పొన్నూరు వెంకటరమణ, మామిడి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సింహాద్రి నివాళి

అవనిగడ్డ: అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి, స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఎమ్మెల్యే సింహాద్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు సేవలు ఆదర్శనీయమన్నారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, సర్పంచ్ గొరుముచ్చు ఉమా, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అవనిగడ్డ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



పెడనలో నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

- పెడన: ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం అశువులు బాసిన అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పట్టణ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక శ్రీవాసవి ప్రార్థన మందిరంలో నిర్వహించారు. అఖిల భారత ఆర్యవైశ్యుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకుడు, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా ఆధ్వర్యంలో సంఘ నాయకులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిన్నా మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం 58 రోజుల పాటు కఠోర దీక్ష చేసి ప్రాణాలను అర్పించి ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచారన్నారు. పొట్టి శ్రీరాములు ఆత్మ బలిదానంతోనే దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడ్డాయని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ ఆర్య వైశ్య సంఘం ఉపాధ్యక్షుడు కొల్లిపర నరసింహారావు, చిట్టూరి పశుపతినాథ్‌బాబు, కార్యదర్శి జవాజి నాగు, సభ్యులు పాదర్తి శ్రీను, తుమ్మలపల్లి సుధీర్, జల్లూరి సాంబ, శ్రీ వాసవి క్షేత్రం ప్రధాన అర్చకుడు స్వర్ణ సాయిబాబు, ముత్యాలమ్మ గుడి నిర్వాహకులు తోట పైడేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- బంటుమిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ జె. స్వర్ణభారతి, ఎంఈఓ–1 బి. త్రిపురసుందరీదేవీ అధికారులతో కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాష్ట్రావతరణకు ఆయన చేసిన త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వెంకటేశ్వరరావు, పీడీ మోహన్‌రావు, ఏఓ డీఎస్‌కే రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, సీఆర్‌పీలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నాగాయలంకలో దుస్తులు బహూకరించిన ఆర్యవైశ్యసంఘ నాయకులు

- కోడూరు: స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, అధికారులు పాల్గొన్నారు.

మెరుగుపడిన పేదల జీవన ప్రమాణాలు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- 482 మందికి ఓటీఎస్ పట్టాల పంపిణీ



పట్టాలు అందుకున్న లబ్ధిదారులతో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

కోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. కోడూరు పంచాయతీ కార్యాలయం వద్ద వన్ టైం సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఎంపీడీఓ శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే రమేష్‌బాబు మాట్లాడారు. 1995 నుంచి నివాసముంటున్న గృహాలకు పట్టాలు లేకపోయినా వారికి ప్రభుత్వమే రిజిస్ట్రేషన్ చేయించి భూమిపై హక్కు కల్పిస్తూ పట్టాలను అందిస్తోందన్నారు. పేదలకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను కూడా అమలు చేశారని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న మేలును చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎమ్మెల్యే సీటు కేటాయింపుపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తుది నిర్ణయం తీసుకుంటారని, దీనిని కూడా టీడీపీ నేతలు రాజకీయం చేయడం సమంజసం కాదన్నారు. టీడీపీ, జనసేన పొత్తు వల్ల ఆ పార్టీల్లో నేతల మధ్య ఉన్న విభేదాలు బహిర్గతం అవుతున్నాయని, వీటిని ప్రజలు కూడా గమనిస్తున్నారని చెప్పారు.

బుద్ధప్రసాద్ తీరు హాస్యాస్పదం..

నియోజకవర్గంలో చలామణిలో లేని మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రభుత్వంపై బురద చల్లడం హాస్యాస్పదంగా ఉందని రమేష్‌బాబు విమర్శించారు. మంత్రిగా, ఉప సభాపతిగా, ఎమ్మెల్యేగా 20 ఏళ్ల పాటు అధికారంలో ఉన్న బుద్ధప్రసాద్ రైతులకు మేలు చేసిన దాఖలాలు లేవన్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి డెల్టా ఆధునికీకరణకు రూ.165 కోట్లు కేటాయిస్తే ఆ నిధులతో రైతులకు మేలు చేయకుండా కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూరే పనులు చేశారని విమర్శించారు. పాదాలవారిపాలెం వద్ద రైతులకు ఉపయోగపడేలా మోటర్లు ఏర్పాటు చేస్తే దానిని రాజకీయం చేసిన వ్యక్తి బుద్ధప్రసాద్ అని విమర్శించారు. ఈ ఏడాది వరిపంట బాగా పండిందని, అనుకోకుండా వచ్చిన తుపాను వల్ల పంటకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కోడూరు–అవనిగడ్డ రహదారి నిర్మాణాన్ని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

482 మందికి పట్టాల పంపిణీ..

ఓటీఎస్ పథకం ద్వారా లబ్ధిపొందిన 482 మందికి పట్టాలను ఎమ్మెల్యే రమేష్‌బాబు పంపిణీ చేశారు. పట్టాల ద్వారా రుణాలు కూడా పొందవచ్చని రమేష్‌బాబు చెప్పారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, ఎంపీపీ కొండవీటి వెంకటకుమారి, సర్పంచి వెన్నా షైనీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ప్రజాప్రతినిధులు, పలు విభాగాల కన్వీనర్లు, నాయకులు పాల్గొన్నారు.

18 నుంచి పంట నష్టపోయిన రైతుల జాబితాల ప్రదర్శన

పెడన: మిచాంగ్ తుపానుకు పంట నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేస్తున్నామని, ఈ జాబితాలను ఈ నెల 18వ తేదీ నుంచి 22వ తేదీ వరకు ఆర్‌బీకేలలో ప్రదర్శిస్తామని ఏఓ జీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన పెడన మండలం బల్లిపర్రు, కాకర్లమూడి గ్రామాల్లో పంట నష్టం వివరాల నమోదు ప్రక్రియను, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలను నమోదు చేసేందుకు గ్రామ స్థాయిలో ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వీఆర్వో, వీఏఏలుంటారని, పంట పొలాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. మీ పంట నష్టపోతే ఆ సమాచారం వీఆర్వోకు, లేదా వీఏఏకు తెలియజేసి మీ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్ కాపీలతో పాటు ఫోన్ నెంబర్ ఇవ్వాలని సూచించారు. ఈ నెల 18వ తేదీతో పంట నష్టం వివరాల నమోదు పూర్తవుతుందని, 18 నుంచి 22వ తేదీ వరకు ప్రతి ఆర్‌బీకే పరిధిలో పంట నష్టపోయిన రైతుల వివరాలను ప్రదర్శిస్తామని తెలిపారు. వీటిపై ఏమైనా అభ్యంతరాలు, మార్పులు, చేర్పులున్నా వాటిని పరిష్కరించి తుది జాబితాను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తామన్నారు. ఎంపీఈఓలు కీర్తి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా వెంకూ



వెంకూమాస్టర్



షేక్ సలార్‌దాదా

కోనేరుసెంటర్: వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం సంయుక్త కార్యదర్శిగా బందరు మండలం చిన్నాపురం గ్రామానికి చెందిన విత్తంశెట్టి వెంకూ మాస్టర్ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. వెంకూ మాస్టర్ మాట్లాడుతూ తనకు పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవికి కృతజ్ఞతలు తెలిపారు. వెంకూని పలువురు అభినందించారు.

మైనార్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా సలార్‌దాదా..

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా మచిలీపట్నానికి చెందిన షేక్ సలార్‌దాదా నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం పార్టీ మైనార్టీ విభాగం జోన్ ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సలార్‌దాదా మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే పేర్ని నాని, యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టుకు కృతజ్ఞతలు తెలిపారు. సలార్‌దాదాకు పలువురు అభినందనలు తెలిపారు.

డాక్టర్ల విభాగం జిల్లా కమిటీలో నలుగురికి స్థానం..

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం జిల్లా కమిటీలో మచిలీపట్నం నియోజకవర్గానికి చెందిన నలుగురు వైద్యులకు స్థానం లభించింది. జిల్లా కమిటీ ఉపాధ్యక్షుడిగా 36వ డివిజన్ కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ధనికొండ వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా బోయిన జగన్మోహనరావు, జాయింట్ సెక్రటరీగా నారగాని లీలాసత్య వెంకట దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. వీరిని పలువురు అభినందించారు.

సంక్షేమ సారథి జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలి

పేర్ని కిట్టు



బందరు 48వ డివిజన్‌లో బోర్డును ఆవిష్కరించిన పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలో సంక్షేమ పాలన అందిస్తూ సంక్షేమ సారథిగా పేరుపొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. నగరంలోని 48, 1 డివిజన్లలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా అమలుకాని పలు ప్రజా సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబానికి మేలు జరిగిందని చెప్పారు. ప్రతి కుటుంబానికి మేలులు చేసిన సీఎం జగన్‌ను రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్నను దీవించకుంటే సంక్షేమ పథకాల అమలు కుంటుపడుతుందన్నారు. ఆయా డివిజన్లలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలతో కూడిన బోర్డులను, పార్టీ జెండాలను పేర్ని కిట్టు ఆవిష్కరించారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు ముచ్చర్ల శైలజ, జోగి చిరంజీవి, మిరియాల బసవపూర్ణమ్మ, పల్లి సింహాచలం, కో–ఆప్షన్ సభ్యురాలు మట్టా తులసి, వైఎస్సార్ సీపీ నాయకులు మన్నే శేషారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి జగనన్నే మళ్లీ సీఎం కావాలి..

కోనేరుసెంటర్: రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలంతా కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కిట్టు అన్నారు. కానూరు గ్రామంలో శుక్రవారం జరిగిన ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో కిట్టు పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల బోర్డును, పార్టీ జెండాను కిట్టు ఆవిష్కరించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, కానూరు పీఏసీఎస్ అధ్యక్షుడు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు శ్రీకాకుళపు నాగేశ్వరరావు, గోకవరం పీఏసీఎస్ అధ్యక్షుడు గడిదేశి బాలజీసు, సర్పంచ్ చెక్కా లక్ష్మి, ఉప సర్పంచ్ గోపు మురళి, కానూరు మత్స్యకార సంఘం అధ్యక్షుడు బొమ్మిడి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు గణపాబత్తుల సత్యనారాయణ, చూడామణి పాల్గొన్నారు.

కంచాకోడూరులో..

గూడూరు: గూడూరు మండలం కంచాకోడూరులో శుక్రవారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డు, గ్రామంలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ గూడూరు మండల కన్వీనర్ పర్సం పెదబాబు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలంతా నిండుమనస్సుతో మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. సర్పంచు కోళ్ల హనుమంతరావు, పీఏసీఎస్ చైర్మన్ బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు జక్కా రాజేష్, మేడా అంజిబాబు, గుడివాడ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయం

అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

చల్లపల్లి: కేసుల సత్వర పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఆయనకు సీఐ సీహెచ్ నాగప్రసాద్, ఎస్ఐ సీహెచ్ చినబాబు సిబ్బందితో కలిసి గౌరవ వందనం సమర్పించి ఘన స్వాగతం పలికారు. స్టేషన్ ఆవరణలో డీఎస్పీ మొక్కలు నాటారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ స్టేషన్‌లో అన్నిరకాల కేసుల దర్యాప్తు, పరిష్కారం తీరు తనిఖీ చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మచిలీపట్నంటౌన్: ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ మచిలీపట్నం నగర పాలక సంస్థ శాఖ నూతన కార్యవర్గం శుక్రవారం ఎన్నికైంది. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దుప్పలపూడి ఈశ్వర్ పర్యవేక్షణలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక మునిసిపల్ సమావేశం హాలులో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా బొర్రా వెంకట కల్యాణ్, ఉపాధ్యక్షులుగా బీఎస్‌వీ లక్ష్మి, వరప్రసాద్, ఎస్‌వీ రాఘవులు, ఆకుల ఉమామహేశ్వరరావు, కోశాధికారిగా వి. సాయినరసింహారావు, కార్యదర్శిగా బండారు కృష్ణ, ఆర్గనైజేషన్ సెక్రటరీగా గంధం వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఒడుగు నరేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని నగర పాలక సంస్థ ఉద్యోగులు, సంఘ నాయకులు అభినందించారు.

క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి

బెల్ ఏజీఎం సహదేవుడు

మచిలీపట్నంటౌన్: విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలని బెల్ కంపెనీ ఏజీఎం బి. సహదేవుడు అన్నారు. స్థానిక పీఎంశ్రీ కేంద్రియ విద్యాలయంలో శుక్రవారం వార్షిక క్రీడా దినోత్సవం, విద్యాలయ సంఘటన్ 66వ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సహదేవుడు మాట్లాడుతూ విద్యాలయాల్లో క్రీడలకు ఉన్న ప్రాధాన్యతను వివరించారు. క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందించారు. ప్రిన్సిపాల్ మొహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో చర్మ వ్యాధి నిపుణుడు ఫణికుమార్, యూబీఐ ఫౌండర్ బ్రాంచ్ మేనేజర్ ఉమాదేవి, బెల్ కంపెనీ విశ్రాంత ఇంజినీర్ ఏఆర్‌కే ప్రసాద్, ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు పాల్గొన్నారు.

100 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కోనేరుసెంటర్: మచిలీపట్నం వైజ్‌మెన్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం గుండుపాలెం గ్రామంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 100 మందికిపైగా వృద్ధులకు అప్తాలమిక్ టెక్నీషియన్ సయ్యద్‌పీర్ కంటి పరీక్షలు చేశారు. నేత్ర సమస్యలు, నివారణపై అవగాహన కల్పించారు. చిన్నాపురం అవేర్ ఆస్పత్రి వైద్యుడు ప్రభాకర్, సిబ్బంది గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. విష జ్వరాలు సోకకుండా హోమియోపతి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. వైజ్‌మెన్ క్లబ్ సభ్యులు కృష్ణ, ఇస్మాయిల్, పూర్ణచంద్రరావు, హేమాద్రి, శ్రీనివాసరావు, పిరమిడ్ ధ్యాన కేంద్రం నిర్వాహకుడు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చల్లపల్లి: అవనిగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో శనివారం ఉదయం, మధ్యాహ్నం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ చల్లపల్లి సబ్ డివిజన్ డీఈఈ పులి శివ నాగేశ్వరరావు తెలిపారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి, అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక మండలాల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.


సబ్సిడీపై మినుము విత్తనాలు పంపిణీ



కృత్తివెన్ను: మిచాంగ్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పంట పొలాల్లో చల్లుకునేందుకు మినుము విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తోందని ఎంపీపీ గరుడప్రసాద్ అన్నారు. శుక్రవారం చినపాండ్రాక సచివాలయం వద్ద రైతులకు సబ్సిడీపై మినుము విత్తనాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు 80 శాతం సబ్సిడీపై మినుము విత్తనాలను ప్రభుత్వం అందిస్తోందన్నారు. ఏఓ ఎస్. జెన్ని మాట్లాడుతూ అర్హత కలిగిన రైతులు ఆర్‌బీకేలలో సంప్రదించి విత్తనాలను తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రత్నకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వెంకట్రాజు, వ్యవసాయ సలహా సంఘం జిల్లా బోర్డు సభ్యుడు పట్టపు నాని తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో పాడి గేదెలకు గాయాలు

భావదేవరపల్లి(నాగాయలంక): స్థానిక రైతు కొండేటి గోపాలకృష్ణకు చెందిన పశువుల చావిడి శుక్రవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. దానిలో ఉన్న నాలుగు పాడి గేదెలకు కాలిన గాయాలయ్యాయి. రైతు స్వల్పంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పశుసంవర్ధక శాఖ అధికారులతో మాట్లాడి బాధిత రైతుకు ప్రభుత్వం ద్వారా రావలసిన బీమా మొత్తం త్వరితగతిన వచ్చేలా చూడాలని కోరారు. పాడి గేదెలకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.



మచిలీపట్నంటౌన్: స్థానిక మహతి కళావేదికపై 18 అధ్యాయాల భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు శుక్రవారం ఉత్సాహంగా జరిగాయి. పోటీలకు పలువురు మహిళలు, పురుషులు హాజరై భగవద్గీత శ్లోకాలను పఠించారు. శనివారం 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు పోటీలు నిర్వహిస్తామని హిందూ ధర్మ ప్రచార పరిషత్ కన్వీనర్ తురగ ప్రసాద్ తెలిపారు. విజేతల పేర్లను శనివారం ప్రకటించి బహుమతులు అందజేస్తామన్నారు.